క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే



మొసలపల్లిలో రీ సర్వేపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. మొసలపల్లిలో భూ సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వందేళ్ల నాటి రెవెన్యూ రికార్డులను సరిచేసి రైతుల సమస్యలను పరిష్కరించడమే రీ సర్వే లక్ష్యమన్నారు. రెవెన్యూ ఆర్ఎస్ఆర్ రిజిస్టర్‌లో ఆర్ఎస్ నంబర్‌కు బదులుగా రైతులకు ఎల్‌పీ నంబర్ కేటాయించారన్నారు. అలాగే రికార్డుల్లో రైతుల పేర్లు తప్పులు ప్రచురించినా, భూములు హెచ్చుతగ్గులు ఉన్నట్లుగా రైతులు గుర్తిస్తే ఆయా వివరాలతో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు సంబంధిత దస్తావేజుల జెరాక్స్‌లను అందజేయాలని సూచించారు. వాటిని పరిశీలించి రీ సర్వే చేశారు. 45 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కట్టా గోపాలకృష్ణగోఖలే, ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ, వీఆర్వోలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

కూటమి నేతల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి



ఎంపీ, ఎమ్మెల్యేలు హరీష్ మాథుర్, దేవ వరప్రసాద్‌లతో ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్

మలికిపురం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ నిమిత్తం ఎన్డీఏ కూటమి సమావేశం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ వద్ద బుధవారం జరిగింది. అతి త్వరలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ పోటీ చేయనున్నారు. రాజశేఖర్‌ను గెలిపించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లు కోరారు. అనంతరం ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌కి సంబంధించి ఓటు నమోదు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎం.అయ్యాజీ వేమా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో 15 మంది లబ్ధిదారులకు బుధవారం రూ.7,47,289ల చెక్కుల రూపంలో తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. పార్టీ నాయకుడు వాసంశెట్టి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అంధులకు, మంచానికే పరిమితమైన వికలాంగులకు రూ.15 వేల వంతున అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, నూకపెయ్యి ప్రసన్న కుమార్, అడబాల తాతకాపు, పోలిశెట్టి రాజేష్, శేరు శ్రీనుబాబు, ఆదిమూలం సూరయ్య కాపు పాల్గొన్నారు.

రావులపాలెం సినిమాలు



పద్మశ్రీ: విశ్వం
అక్షర స్క్రీన్–1: వేట్టయాన్
అక్షర స్క్రీన్–2: ఉదయం: మిస్టర్ పర్‌ఫెక్ట్
మధ్యాహ్నం: జనక అయితే గనక
శ్రీవేంకటేశ్వర: దేవర

తుపాను హెచ్చరికలతో రైతుల బేజార్

- దానా ప్రభావంపై ఆందోళన
- కోతకు సిద్ధంగా ఖరీఫ్ చేలు



పెనికేరులో ఇటీవల కురిసిన వర్షానికి ఒరిగిన వరిచేలు



ఆలమూరులో మేఘావృతమైన ఆకాశం

ఆలమూరు: బంగాళఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడి తుపాన్‌గా మారిందని తెలియడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరిపంట చేతికొచ్చే సమయానికి వరుస తుపాన్‌లు సంభవించడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఈ నెలలో ఇప్పటికే రెండు తుపానులు రాగా మరోసారి బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్‌కు దానాగా నామకరణం చేయడంతో రైతుల్లో కలవరం ప్రారంభమైంది. ఈ అల్పపీడన ప్రభావం వల్ల మూడు రోజుల వరకూ పిడుగులు, ఉరుములతో పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలియజేయడంతో రైతుల కంటి మీదు కునుకు లేకుండా జీవనం సాగిస్తున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఖరీఫ్‌కు సంబంధించి 28,874 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే కొత్తపేట నియోజకవర్గం పంట తుది దశకు చేరుకోగా మిగిలిన ప్రాంతాల్లో కంకి గట్టిపడి రంగు మారే దశలో ఉంది. ఇప్పటికే రెండు తుపాన్ల ప్రభావం వల్ల అక్కడక్కడా వరిచేలు నేలకొరిగాయి. దీంతో పంట దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విత్తన తయారీలో రైతుల బిజీ

రాబోయే రబీ సీజన్ కోసం రైతులు విత్తనాల కోసం సాగు చేసిన వరిచేలు కోత దశకు చేరుకుంది. దీంతో రైతులు బల్లకట్టు పద్ధతిలో విత్తనాలు తయారు చేసుకుని నిల్వ చేసుకునేందుకు సంసిద్ధమవుతున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో విత్తనాల తయారీలో ఆటంకం ఏర్పడుతుందేమోనని కలవరపాటు మొదలైంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తుపాన్ కనుక సంభవిస్తే చేతికొచ్చిన పంటను విత్తనాల అవసరాల కోసం ఏ విధంగాను ఉపయోగపడదని రైతులు చెబుతున్నారు. దీనివల్ల రబీ సాగుకు మళ్లీ అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతాయనే ఆందోళన చెందుతున్నారు. ఏటా ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి తమ సహనానికి పరీక్ష పెడుతుందని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని అబ్బురపడుతున్న సమయంలో తుపాన్ హెచ్చరికలు రావడంతో రైతులను నిరుత్సాహానికి గురి చేస్తుంది.

ఉపాధి కోల్పోయిన కార్మికులు

వరుస తుపాన్‌ల ప్రభావంతో ఇప్పటికే వ్యవసాయ, భవన నిర్మాణ, ఇటుక బట్టీ కార్మికులు ఉపాధి కోల్పోయారు. దానా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ చిన్నతరహా పరిశ్రమలు మరింత కాలం మూతబడి ఉపాధి కోల్పోయే ప్రమాదముందనే కార్మికులు తీవ్ర మదన పడుతున్నారు. వరుస తుపాన్‌ల ప్రభావంతో ప్రజా అస్తవ్యస్తంగా మారింది. ఏ సమయంలో వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు రహదారులన్నీ గోతులమయంగా మారి ప్రయాణమంటేనే హడలెత్తే ప్రమాదం ఏర్పడింది.

రైతులు ఆందోళన చెందవద్దు



జిల్లాలో దానా తుపాన్ ప్రభావం పాక్షికంగా ఉంటుంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు రెండు రోజుల పాటు పనులకు విరామం ఇవ్వాలి. ఖరీఫ్ సాగు తుది దశకు చేరుకున్నందున పంటను సంరక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమవ్వాలి.

– ఎస్.లక్ష్మి లావణ్య, ఏవో, ఆలమూరు

గురుస్వామి దంపతులకు సన్మానం



వాడపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో రామచంద్రశర్మ-ఆదిలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకులు, అయ్యప్ప దీక్ష గురుస్వామి దొంతికుర్తి రామచంద్రశర్మ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. సుదీర్ఘ కాలం పాటు కొత్తపేట కళానగర్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రధాన అర్చకునిగా దైవ సేవలో తరించి, ఆ ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన రామచంద్రశర్మ 2017 నుంచి వాడపాలెంలో భక్తుల కోరిక మేరకు జ్ఞాన సరస్వతీదేవి, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకుడిగా సేవ చేస్తున్నారు. ఏటా అత్యధిక సంఖ్యలో స్వామి అయ్యప్ప మండల దీక్ష, జ్యోతి దీక్ష మాలధారులు రామచంద్రశర్మ చేతుల మీదుగా అయ్యప్పమాల ధరించడం, 41 రోజుల అనంతరం ఇరుముడులు కట్టించుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన భక్తులు, గ్రామ పెద్దలు బుధవారం మధ్యాహ్నం భిక్ష సమయంలో గురుస్వామి రామచంద్రశర్మ-ఆదిలక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం శర్మ దంపతులు సుమారు 300 మంది మాలధారులు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం అందరికీ పండ్లు, పంచామృతాలతో అయ్యప్పస్వామికి నివేదించిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ బండారు బులితాత, గ్రామ పెద్దలు మట్టా పట్టాభి రామయ్య, ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, కమిటీ సభ్యులు వరగన వరబాబు, పప్పుల వెంకటేష్, పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వక్కలంకలో మాట్లాడుతున్న ఏవో విజయ్‌కుమార్

అంబాజీపేట: రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ జీవ ఎరువులు వాటి ఉపయోగం, వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి రైతులకు వివరించారు. ఉద్యానశాఖ ఏఈఓ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొబ్బరిచెట్లకు ఆశించిన తెల్లదోమను అరికట్టేందుకు రైతులంతా సామూహిక చర్యలు చేపట్టాలన్నారు. ప్యాక్ హౌస్ కొబ్బరి నిల్వ చేసుకోవడానికి సుమారుగా రూ.2 లక్షల వరకు రాయితీ వస్తుందన్నారు. కూరపాదులు, పందిరి ఏర్పాటుకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: శృంగవరప్పాడు, ఉయ్యూరు వారి మెరక గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు రావి నాగవెంకటలక్ష్మీదేవి, ఓగూరి రత్నకుమారిల అధ్యక్షతన రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామ సమావేశాలలో సమాచార హక్కు చట్టంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కాగా వరి పంటపై ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుటకు విధి విధానాలపై ఏవో పీపీ నరసింహారావు వివరించారు. ఎంపీటీసీ యెనుముల కొండమ్మ, స్థానిక నాయకులు రావి త్రిమూర్తులు, యెనుముల ఆనంద్‌కుమార్, ఓగూరి బాబులు, పలువురు రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలంటూ ధర్నా



రోడ్డు సమస్యపై బి.దొడ్డవరంలో ధర్నా చేస్తున్న స్థానికులు

మామిడికుదురు: బి.దొడ్డవరం-పెదపట్నంలంక ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైపోయి అధ్వానంగా మారిందని ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందంటూ స్థానికులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిల్చుని ధర్నా చేశారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని, దీన్ని తక్షణం ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. రోడ్డు అధ్వానంగా మారడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని, రోడ్డు పాడైపోవడంతో ఆర్టీసీ సర్వీసును కూడా నిలిపివేశారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆటోలకు భారీగా కిరాయి చెల్లించాల్సి వస్తోందని వాపోయారు. తక్షణం రోడ్డును అభివృద్ధి చేసి కష్టాలు తొలగించాలని నినాదాలు చేశారు. ఆందోళనలో సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ పసుపులేటి మహాలక్ష్మీరావు, కేదారశెట్టి మల్లి, కుడుపూడి త్రిమూర్తులు, బద్దే రామకృష్ణ, పినిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ప్రజల చెంతనే ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ సూచించారు. మండలంలోని మాచవరం–4, ఇరుసుమండ, నందంపూడి సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. మాచవరంలోని సచివాలయం 1, 4ల వద్ద సాంకేతిక లోపాలు తలెత్తడంతో నిలుపుదల చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల వద్ద ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయన్నారు. ఈ నెల 25 వరకు ఆధార్ నమోదు శిబిరాలు కొనసాగనున్నట్లు ఎంపీడీ తెలిపారు.

మూడు గ్రామాల్లో ఆధార్ సేవలు

ఆలమూరు: మండలంలోని సంధిపూడి, చింతలూరు, చొప్పెల్ల గ్రామాల్లో బుధవారం ఆధార్ శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఈ ఆధార్ శిబిరాలను సర్పంచ్‌లు తోట భవానీ, మార్గని కరుణ, దంగేటి చంద్రకళ ప్రారంభించారు. అలాగే గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు మీసాల నరేష్, వి.దుర్గాప్రసాద్, తేజ తదితరులు ఆధార్ సేవలను అందించారు. ఆయా గ్రామాల్లోని పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 230 మంది తమ ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు చేయించుకున్నారు. గ్రామ కార్యదర్శులు ఎస్.వీర్రాజు, ఎం.విజయారెడ్డి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



మడికిలో వెన్నెలకు న్యాయం జరగాలంటూ నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

ఆలమూరు: మండలంలోని మడికి శివారు చిలకలపాడులో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన పదోతరగతి విద్యార్థిని చెక్కపల్లి వెన్నెల (15)కు మద్దతుగా బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. మృతురాలు వెన్నెల నివాసం నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న చెముడులంకలోని షిర్డీసాయి విద్యానికేతన్ వరకూ ఈ కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. 216 ఏ జాతీయ రహదారిపై బైఠాయించి వెన్నెలకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల హింసపై ప్రభుత్వం స్పందించాలంటూ డిమాండ్ చేశారు. పదో తరగతి విద్యార్థి వెన్నెలకు జరిగిన అన్యాయాన్ని భవిష్యత్‌లో ఇంకెవరికీ జరగకుండా యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతురాలు వెన్నెల కుటుంబ సభ్యులకు మద్దతుగా గ్రామస్తులు నిర్వహించిన ఈ ర్యాలీకి అనేక విద్యార్థి సంఘాలు, రాజకీయ నేతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు మద్దతు పలికారు.

శరణుఘోషతో మార్మోగిన ర్యాలి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు



అయ్యప్పకు నిర్వహిస్తున్న 18 మెట్ల పూజ

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో వెంకటేశ్వర నగర్ వద్ద అయ్యప్ప మాలధారుల శరణుఘోషతో మార్మోగింది. 54 కలశాల పూజ, మహాపడి పూజ, గురుస్వామి ఎస్.కన్నబాబు ఆధ్వర్యంలో తాటిపాక కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం మహాపడి పూజ జరిగింది. సుమారు 800 మంది స్వాములు ఈ పూజలో పాల్గొన్నారు. ఉదయం గణపతి హోమం, సాయంత్రం అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ఆత్రేయపురం మార్మోగింది. 18 మెట్లను నిర్మించి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, కుమార స్వామి, దుర్గాదేవి, మణికంఠ స్వాములతో వివిధ పూజలు నిర్వహించారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

ఆలమూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో తరచూ సంభవించే రక్తహీనత సమస్యను నివారించేందుకు వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ కోరారు. మండలంలోని జొన్నాడ, ఆలమూరు, కలవచర్ల గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అలాగే హైరిస్క్ ప్రసూతి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

శ్రీపాద వల్లభుడికి అభిషేకం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో శ్రీపాదవల్లభుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా పిఠాపురానికి చెందిన శ్రీపాద వల్లభుని ప్రత్యేక రథం బుధవారం ఇక్కడకు చేరుకుంది. శ్రీపాదవల్లభునికి ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో ప్రత్యేక ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీపాదవల్లభుని విగ్రహాన్ని ఆలయంలో ఉంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

ఆలమూరు మండలం అధికారుల ఫోన్ నంబర్లు

హోదా	పేరు	ఫోన్ నంబరు
తహసీల్దార్	కెజె.ప్రకాష్‌బాబు	98499 03902
ఎంపీడీఓ	కె.జాన్‌లింకన్	94938 17051
ఈఓపీఆర్‌డీ	ఏ రాజు	83175 42815
ఏడీఏ	కె.నాగేశ్వరరావు	83310 56664
ఏఓ	ఎస్.లక్ష్మి లావణ్య	83310 56557
ఏపీఓ	జి.అరుణకుమారి	70933 23644
ఏపీఎం	ఎం.ధనరాజు	98499 01696
హౌసింగ్ జేఈ	డి.శ్రీనివాసు	70939 30448
ఎంఈఓ–1	బి.అప్పాజీ	80748 05733
ఎంఈఓ–2	కెవి.సుబ్బరాజు	96189 37973
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	పి.పద్మ	91001 21135
సీడీపీఓ. కొత్తపేట	పి.శారద	94408 14683
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	టిఎన్‌వి.నాగలక్ష్మి	63099 39852
చొప్పెల్ల పీహెచ్‌సీ	డి.సువర్చలాదేవి	70136 40523
పెదపళ్ల పీహెచ్‌సీ	పి.భవానీశంకర్	88017 87816

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రజతం

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రాజోలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గుడాల నిఖిల్ అండర్–17 విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 22 వరకు నంద్యాలలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ పద్మావతి నగర్‌లోని స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించిందన్నారు. రజత పతకం సాధించిన నిఖిల్‌కు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు ప్రసాద్‌ను అభినందించారు.

నగరం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై చైతన్యకుమార్

మామిడికుదురు: అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా నగరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. నగరం ఎస్సై చైతన్యకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌పై అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, బాధ్యతలు, నేరాలు, శిక్షలు, పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు వాటి నైసర్గిక స్వరూపాలు, తదితర అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించామని ఎస్సై తెలిపారు.

ఉచిత బస్సేదండి బాబూ..



బస్సులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మలికిపురం: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచిన ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయకపోవడంపై రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. లక్కవరంలో బస్సులో ప్రయాణం చేసి నిరసన వ్యక్తం చేస్తూ వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, సరెళ్ల ప్రసన్నకుమార్, అల్లూరు మధురాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీరామమూర్తిని పరామర్శిస్తున్న రాజేశ్వరీదేవి

అంబాజీపేట: ఇటీవల అంబాజీపేటలో సతీవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి గంటి శ్రీరామమూర్తిని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి బుధవారం పరామర్శించారు. శ్రీరామమూర్తి భార్య బాలా త్రిపుర సుందరి చిత్రపటం వద్ద నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గంటి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పార్టీ నాయకులు పాముల ప్రకాష్, కుసుమ శ్రీనివాస్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పౌరులకు సమాచారం పొందే హక్కు ఉంది



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మృదుల

మామిడికుదురు: సమాచారం హక్కు చట్టంలోని నిబంధనలకు లోబడి పౌరులందరికీ సమాచారాన్ని పొందే హక్కు ఉందని మండల వ్యవసాయాధికారి జి.మృదుల సూచించారు. పాశర్లపూడి రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం శిక్షణ కార్యక్రమం, అవగాహన సదస్సు జరిగింది. సమాచార హక్కు చట్టంలోని షెడ్యూళ్లు, అప్పిలేట్ అధికారి, పబ్లిక్ ఇన్ఫర్ మేషన్ అధికారి ప్రతి ఆఫీసులో ఉంటుందన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో ఇవ్వాలన్నారు. అందులో ఆరు చాప్టర్లు ఉంటాయని వాటిలోని అంశాలు పౌర సమాచారం పొందే హక్కు ఉంటుందన్నారు. పలు అంశాలపై ఏఓ అవగాహన కల్పించారు.